సాక్షి
రంగారెడ్డి
శుక్రవారం । 17 । మే । 2024



అకాల వర్షం.. తీరని నష్టం

ఎండ వేడితో ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. అకాల వర్షంతో ధాన్యం తడిసి ముద్దయింది. 8లో▸



ముందస్తు జాగ్రత్తలేవీ?

ముందు జాగ్రత్త చర్యలు లేక మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు పలు చెరువులు, కత్వలకు గండ్లు పడ్డాయి. 8లో▸



న్యాయవాదికి పురస్కారం

సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న షాద్‌నగర్‌కు చెందిన సీనియర్ న్యాయవాది మహేందర్‌రెడ్డికి ప్రశంసలు దక్కాయి. 8లో▸

రుణమాఫీకి కసరత్తు

- అర్హుల జాబితా రూపకల్పనలో అధికారులు నిమగ్నం
- కటాఫ్, రెన్యూవల్ చేసుకున్న రుణాలపై స్పష్టత కరువు
- అన్నదాతల్లో ఒకవైపు ఆశలు, మరోవైపు ఆందోళన

సాక్షి, రంగారెడ్డి జిల్లా/షాద్‌నగర్: రైతులకు ఆగస్టు 15లోగా రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రతి సభలోనూ ఆయన రైతులకు హామీ ఇచ్చారు. ఈ క్రమంలో పోలింగ్ ముగియడంతో రుణమాఫీకి సంబంధించిన కసరత్తు మొదలైంది. అధికారులు అర్హులైన రైతుల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. దీంతో పంటల సాగు కోసం బ్యాంకులు, పీఏసీఎస్‌లలో రుణాలు పొందిన వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

స్పష్టత కరువు

మరోవైపు ఎప్పటిలోగా రుణాలు తీసుకున్న వారికి రుణమాఫీ వర్తిందనే అంశంపై స్పష్టత లేకపోవడంతో రైతుల్లో కాస్త ఆందోళన మొదలైంది. కుటుంబంలో ఒకే రైతుకు పరిమితం చేస్తారా.. లేదా ఎంత మంది తీసుకుంటే అంత మందికి మాఫీ వర్తింపజేస్తారా అనేది తేలాల్సి ఉంది. అంతేకాదు ఆయా బ్యాంకుల ఒత్తిళ్ల మేరకు ఇప్పటికే రుణాలు రీ షెడ్యూల్ చేసుకున్న రైతులకు రుణమాఫీ పథకం వర్తిస్తుందా లేదా అనే దాని విషయంలోనూ స్పష్టత కరువైంది.

కటాఫ్ తేదీలు ఇవే..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకులు 370 శాఖలు ఉండగా, గ్రామీణ బ్యాంకులు 57, ప్రైవేటు బ్యాంకులు 202 వరకు కలిపి మొత్తం 629 ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ, గ్రామీణ బ్యాంకులు రైతులకు ఎక్కువగా పంట రుణాలు మంజూరు చేశాయి. 2019 ఏప్రిల్ 1 నుంచి 2023 డిసెంబర్ 10వ తేదీ మధ్య రూ.2లక్షలలోపు రుణాలు తీసుకున్న, రెన్యూవల్ చేసుకున్న రైతులకు మాఫీ వర్తిస్తుందని సీఎం సహా మంత్రులు ప్రకటించారు. దీని ప్రకారం అధికారులు జాబితాలను సిద్ధం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సహకార బ్యాంకులు, ఏపీజీవీబీ బ్యాంకు, వ్యవసాయ సహకార సంఘాల వారే అధిక శాతం రైతులకు పంట రుణాలు మంజూరు చేశారు. గత ప్రభుత్వం దశల వారీగా రుణమాఫీ చేసింది. రూ.25వేలు, రూ.50వేలు, ఆ తర్వాత లక్షలోపు రుణాలను మాఫీ చేసింది. ఈ క్రమంలో రుణాలను సకాలంలో రెన్యూవల్ చేయించని వారికి మాఫీ జరగలేదు. కొత్త ప్రభుత్వం ప్రకటించిన కటాఫ్ తేదీల్లోనూ ఈ రైతులకు చోటు దక్కలేదు. సకాలంలో రుణాలను రెన్యూవల్ చేయించుకోని రైతులు సహకార సంఘాల్లో చాలా మంది ఉన్నారు. ఇలాంటి రైతులు కూడా తమ రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గతంలో రూ.420 కోట్లు మాఫీ

2014 ఏప్రిల్ ఒకటి నుంచి 2018 డిసెంబర్ 18లోపు రుణం తీసుకున్న రైతులకు గత ప్రభుత్వం కుటుంబానికి రూ.లక్ష చొప్పున వడ్డీతో కలిపి నాలుగు విడతల్లో రుణాలను మాఫీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 1,43,278 మంది రైతులు రుణాలు తీసుకోగా వీరిలో ఇప్పటి వరకు 74,701 మంది రైతులకు రూ.420 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ వరకు తీసుకున్న రుణాలకు కూడా మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. పాత రుణాలే పెద్ద సంఖ్యలో పేరుకుపోగా, కొత్తవారికి ఏ విధంగా రుణమాఫీ చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.



షాద్‌నగర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయం

భారం తగ్గుతుంది



పంట పెట్టుబడి కోసం బ్యాంకు నుంచి రూ.1.80 లక్షల రుణం తీసుకున్నాను. రుణమాఫీ కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నాను. ప్రభుత్వం త్వరగా మాఫీ చేస్తే భారం తగ్గుతుంది.

– రాంచంద్రారెడ్డి, రైతు, ముట్పూరు, కొందుర్గు

సాగు కోసం రుణం



ఉన్న కొద్ది పాటి పొలంలో పంటల సాగు కోసం బ్యాంకులో రూ.60 వేల రుణం తీసుకున్నా. ముఖ్యమంత్రి రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో సంతోషంగా ఉంది.

– వెంకటేష్, రైతు, కేశంపేట

జాబితా పంపించాం



448 మంది రైతులు సుమారు రూ.3కోట్లకు పైగా రుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం విధించిన కటాఫ్ తేదీల ప్రకారం రుణాలు పొందిన రైతుల జాబితా తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించాం.

– రఘునందన్, సీఈఓ, పీఏసీఎస్, షాద్‌నగర్



శ్రీశైలం జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, ఇతర నాయకులు

ఓట్లు పడగానే మాట మార్చారు

సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం రైతులను వంచించడమే..

- దొడ్డు వడ్లకు సైతం రూ.500 బోనస్ ఇవ్వాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: రైతు పండించిన దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వకపోవడం రైతులను వంచించడమే అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. దొడ్డు వడ్లకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని మహేశ్వరం గేటు వద్ద శ్రీశైలం జాతీయ రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని విమర్శించారు. అధికారం రాక ముందు రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు పలికి అధికారం వచ్చాక రైతులను ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే కేవలం సన్నవడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామని చెప్పడం అన్నదాతలను మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో 90 శాతం మంది రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారని అన్నారు. ఓట్లు పడగానే రైతుల అవసరం తీరిందని, అందుకే నాలుక తిప్పేశారన్నారు. ఇటీవల వర్షాలకు తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. అంతకు ముందు మహేశ్వరం గేటు వద్ద తెలంగాణ అమరుడు సిరిపురం యాదయ్య విగ్రహానికి ఆమె నివాళులర్పించారు. బీఆర్‌ఎస్ నేతల ఆందోళనతో తుక్కుగూడ నుంచి తుమ్మలూరు గేటు వరకు వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు సర్ది చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు చిలకమర్రి నర్సింహ, మహేశ్వరం, కందుకూరు పీఏసీఎస్ చైర్మన్లు మంచె పాండు యాదవ్, చంద్రశేఖర్, వైస్ చైర్మన్లు దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, విజేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురసాని సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు హన్మగళ్ల చంద్రయ్య, అరవింద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ శశాంక



స్ట్రాంగ్‌రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

చేవెళ్ల: ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతపై అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు కలెక్టర్ శశాంక సూచించారు. మండలంలోని గొల్లపల్లి సమీపంలో ఉన్న బండారి శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో వద్ద ఈవీఎంలను భద్రపర్చిన స్ట్రాంగ్ రూంలను గురువారం వెబ్ క్యాస్టింగ్ స్క్రీనింగ్ ద్వారా పరిశీలించారు. నిరంతరం నిఘా కోసం అమర్చిన క్లోజ్డ్ సర్క్యూట్ కెమెరాల పనితీరు, వాటి ద్వారా కొనసాగిస్తున్న పర్యవేక్షణను పరిశీలించారు. అక్కడ ఉండే అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట చేవెళ్ల ఆర్డీఓ సాయిరాం, కందుకూరు ఆర్డీఓ మహేశ్వరం తహసీల్దార్ సూరజ్‌కుమార్, చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, చేవెళ్ల ఏసీపీ బి.కిషన్ ఉన్నారు.

ఉద్యోగులకు కనీస వేతనాలివ్వండి

ఆదర్శ పాఠశాలల పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు



కమిషన్ చైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం ఇస్తున్న సంఘం నాయకులు

చేవెళ్ల: కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని ఆదర్శ పాఠశాలల పీడీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం సంఘ నాయకులతో నగరంలోని బీఆర్‌కే భవనంలో వేతన సవరణ కమిషన్ చైర్మన్ శివశంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లను కాంట్రాక్టు విధానంలోకి మార్చి, పే స్కేల్ ఇవ్వాలని కోరారు. ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేయాలన్నారు. ప్రస్తుతం వేతనంతోపాటు కట్ అవుతున్న స్టేట్, సెంట్రల్ జీఎస్టీలను తొలగించాలన్నారు. అవర్లీ బేస్డ్ టీచర్లకు రూ.28 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, పీఆర్టీయూ అధ్యక్షుడు గార్లపాటి ఉమాశంకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పార్వతీసత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మంచిరెడ్డి అనంతరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులు అంకితభావంతో పని చేయాలి

ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం సుచరిత



ప్రగతి రథచక్రాల అవార్డు గ్రహీతలతో డిప్యూటీ ఆర్‌ఎం సుచరిత, డిపో మేనేజర్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోను అగ్రస్థానంలో నిలిపేందుకు అంకితభావంతో కార్మికులు, సిబ్బంది పనిచేయాలని ఆ సంస్థ డిప్యూటీ ఆర్ఎం సుచరిత సూచించారు. ప్రగతి రథచక్రాల అవార్డులు పొందిన ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ఉద్యోగులకు గురువారం ప్రశంసాపత్రాలు, నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అవార్డులు పొందిన ఉద్యోగులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోను అగ్రస్థానంలో నిలపడం కార్మికులు, సిబ్బంది చేతుల్లోనే ఉందన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ వెంకటనర్సప్ప, ఏఎంఎఫ్ రామకృష్ణారెడ్డి, ఎస్‌టీఐ వెంకట్‌నాయక్, సూపర్‌వైజర్లు, వెల్ఫేర్ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సజ్జనార్‌కు ఎస్‌డబ్ల్యూ యూనియన్ వినతి

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ కార్మికుల సమస్య సమస్యలను పరిష్కరించాలని టీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూ యూనియన్ విజ్ఞప్తి చేసింది. గురువారం ఆ యూనియన్ ప్రతినిధుల బృందం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. కొంతమంది కార్మికులకు మాత్రమే బాండ్ డబ్బులు ఇచ్చి మిగతావారికి ఇవ్వలేదని ఎండీ దృష్టికి తీసుకెళ్లగా ఈ నెలాఖరులోగా అందరికీ ఇస్తామని హామీ ఇచ్చినట్లు యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

రెచ్చిపోయిన ఆకతాయిలు

- బైక్‌లకు సైడ్ ఇవ్వలేదని బస్సు అద్దాలు ధ్వంసం
- డ్రైవర్‌పై దాడికి యత్నం
- ప్రయాణికులతో వాగ్వాదం
- ఘటనపై సజ్జనార్ సీరియస్

మహేశ్వరం: రోడ్డుపై వెళ్తున్న ఆర్టీసీ బస్సుపై కొంత మంది ఆకతాయిలు బైక్‌లపై గుంపుగా వచ్చి అద్దాలు పగులగొట్టి డ్రైవర్‌పై దాడికి యత్నించారు. ఈ సంఘటన మండల పరిధిలోని శ్రీశైలం రహదారిపై రాచులూరు గేటు వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఉదయం 6.30 గంటలకు కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళ్తుండగా రాచులూరు గేటు వద్దకు రాగానే ఫార్మాసిటీ రోడ్డు నుంచి సుమారు 100 మంది యువకులు బైక్‌లపై హైదరాబాద్ పాతబస్తీకి వెళ్తున్నారు. హారన్ కొట్టినా ఆర్టీసీ బస్సు డ్రైవర్ సైడ్ ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బైక్‌లు ఆర్టీసీ బస్సుకు అడ్డంపెట్టి రాడ్లతో కిటికీ అద్దాలను పగులగొట్టారు. బస్సులో ఉన్న ప్రయాణికులతో వాగ్వాదానికి దిగారు. బస్సులో ఉన్నవారు ఫోన్లలో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్, ప్రయాణికులు మహేశ్వరం, పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. యువకులు ఉదయం కందుకూరు మండలం ఫార్మాసిటీ రోడ్డుపై బైక్ రైడింగ్ చేసి తిరుగుపయనం అవుతుండగా రాచులూరు గేటు వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. వీకెండ్‌లో పాత బస్తీకి చెందిన యువకులు తెల్లవారుజామున, రాత్రి వేళల్లో బైక్‌పై వచ్చి రేసింగ్ చేస్తుంటారు. ఈ విషయంపై పోలీసులకు పలు మార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఆకతాయిలను గుర్తించి కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



పగిలిన ఆర్టీసీ బస్సు అద్దాలు

ఆగ్రహం వ్యక్తం చేసిన ఎండీ సజ్జనార్

అద్దాలు ధ్వంసం చేసిన విషయంపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్ స్పందించి ట్విట్టర్‌లో పోస్టు చేశారు. ప్రజలను నిత్యం సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతున్న బస్సులపై ఎలాంటి కారణం లేకుండా దాడులు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని అన్నారు. ఆర్టీసీ బస్సులు ప్రజల ఆస్తి అని.. దాడులు చేయడం శ్రేయస్కరం కాదని, పోలీసుల సహకారంతో నిందితులపై హిస్టరీ షీట్స్ తెరుస్తామన్నారు. బస్సు డ్యామేజీ ఖర్చు ధ్వంసం చేసిన వారి నుంచి వసూలు చేస్తామని సజ్జనార్ స్పష్టం చేశారు.

బిల్లుల షాక్

- చుక్కలు చూపిస్తున్న కరెంటు చార్జీలు
- నివ్వెరపోతున్న వినియోగదారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: విద్యుత్ బిల్లులు ముట్టుకుంటే షాక్ కొడుతున్నాయి. ఏప్రిల్ నెలకు సంబంధించిన బిల్లులు మేలో జారీ చేస్తున్న విషయం తెలిసిందే. భారీగా చేతికందిన బిల్లులను చూసి వినియోగదారులు నివ్వెరపోతున్నారు. కాల్చిన విద్యుత్ కంటే ఎక్కువగా బిల్లులు వస్తుండటంతో లబోదిబోమంటున్నారు. గ్రేటర్‌లో 60 లక్షలకుపైగా విద్యుత్ వినియోగదారులు ఉన్నారు. తొమ్మిది సర్కిళ్ల పరిధిలో సాధారణ రోజుల్లో వీరి నుంచి నెలకు సగటున రూ.700 కోట్ల వరకు బిల్లు వసూలవుతుంది. మార్చి నుంచి బిల్లులు అమాంతం పెరిగిపోయాయి. మేలో ఏకంగా నెలవారీ బిల్లు రూ.వెయ్యి కోట్లు దాటడం గమనార్హం. ఒక్కసారిగా పెరిగిన బిల్లులు సంస్థకు కాసుల వర్షం కురిపిస్తుండగా, వినియోగదారులకు మాత్రం షాక్ ఇస్తున్నాయి. మెజార్టీ బిల్లులు రంగారెడ్డి జోన్ పరిధిలోని సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, మేడ్చల్, హబ్సిగూడ సర్కిళ్ల పరిధిలోనే వసూలవుతుండటం విశేషం.

నెలవారీ బిల్లు రూ.85,76,902

ఇబ్రహీంపట్నం రూరల్: ఓ వినియోదారుడికి దిమ్మ తిరిగేలా కరెంటు బిల్లు వచ్చింది. ఏకంగా రూ.85,76,902 రావడంతో గుండె ఆగినంత పనైంది. ఇబ్రహీంపట్నం త్రిశక్తి నగర్ కాలనీకి చెందిన ఎన్ను గోవర్దన్‌రెడ్డి తన ఇంటికి గత నెల రూ.800 విద్యుత్ బిల్లు చెల్లించాడు. ఈ నెల 7న విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి బిల్లు కొట్టి ఇవ్వకుండా తిరిగి వెళ్లారు. 9వ తేదీన బిల్లు ఎంత వచ్చిందని ఫోన్ పేలో (రిమైండర్) మెస్సేజ్ చూడగా దిమ్మ తిరిగే షాక్ కొట్టింది. ఏకంగా రూ.85,76,902 చూపించడంతో కంగుతిన్నాడు. ఒకే నెల బిల్లు ఇంత రావడం ఏమిటని విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నించగా ఉరుములు మెరుపులతో మీటర్‌లో సాంకేతిక సమస్య వచ్చిందని సమాధానం ఇచ్చారు. ఈ నెల 21వ తేదీలోపు చెల్లించాలని చెప్పారు. అప్పటి నుంచి అడిగినా మళ్లీ పట్టించుకోలేదు. ఈ క్రమంలో గురువారం మరోసారి అధికారులను ఫోన్లో సంప్రదించగా మీటర్ బాగు చేయించుకోవాలని జవాబిచ్చారు. రూ.900 బిల్లు ఈ నెల 29వ తేదీలోపు చెల్లించాలని మెసేజ్ పంపించారు. విద్యుత్ అధికారుల తీరు చూసి వినియోగదారులు ఆశ్చర్యపోతున్నారు.



ఫోన్‌పేలో చూపిస్తున్న రూ.85,76,902 విద్యుత్ బిల్లు

రేకుల ఇంటికి రూ.11,929 బిల్లు



మొయినాబాద్: వచ్చిన బిల్లును చూపిస్తున్న సత్తమ్మ

మొయినాబాద్: పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు బిల్లు అంటూ ప్రభుత్వం ప్రకటించినా గ్రామాల్లో మాత్రం గుండె గుబేలు మనిపిస్తోంది. రెండు గదుల రేకుల ఇంటికి ఏకంగా రూ.11,929 బిల్లు రావడంతో వృద్ధ దంపతులు బిత్తరపోయారు. మండలంలోని ముర్తూజగూడ గ్రామానికి చెందిన పి.సత్తమ్మకు రెండు గదుల రేకుల ఇల్లు ఉంది. ఇంట్లో సత్తమ్మ, ఆమె భర్త అనంతస్వామి ఇద్దరే ఉంటారు. ఇంట్లో ఫ్యాను, మూడు లైట్లు ఉన్నాయి. ప్రతి నెల రూ.200 లోపే కరెంటు బిల్లు వచ్చేది. ఈ నెలలో ఏకంగా రూ.11,929 వచ్చింది. 22 రోజులకే ఇంత బిల్లు రావడంతో దంపతులు నివ్వెరపోయారు. ఈ విషయమై మండల విద్యుత్ ఏఈ హమునాయక్‌ను వివరణ కోరగా బిల్లును పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

వేడినీళ్లు పడి విద్యార్థినికి తీవ్ర గాయాలు

ఇక్ఫాయి యూనివర్సిటీలో ఘటన

చేవెళ్ల: స్నానం చేసేందుకు వెళ్లిన విద్యార్థినికిపై వేడి నీళ్లు పడి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇక్ఫాయి కళాశాల హాస్టల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కాలేజీలో బీబీఏ (ఎల్ఎల్‌బీ) ఫైనల్ ఇయర్ చదువుతున్న అలేఖ్య బుధవారం రాత్రి స్నానం చేసేందుకు వెళ్లింది. ఎక్కువ వేడిగా ఉన్న గీజర్‌లోని నీళ్లను గమనించకుండా ఒంటిపై పోసుకోవడంతో తీవ్రంగా గాయపడింది. ఒక్కసారిగా కేకలు వేయడంతో తోటి విద్యార్థులు గమనించి, విషయాన్ని కాలేజీ యాజమాన్యంతో పాటు తల్లిదండ్రులుకు సమాచారం ఇచ్చారు. వెంటనే గచ్చిబౌలిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న నార్సింగి ఏసీపీ రమణగౌడ్, సీఐ వీరబాబు, ఎస్ఐ కోటేశ్వర్‌రావు కళాశాలకు వెళ్లి పరిశీలించారు. ఘటనా స్థలంలో ఉన్న విద్యార్థులను విచారణ చేసి వేడి నీళ్లే ప్రమాదానికి కారణమని తెలిపారు. ఈ అంశంపై యాసిడ్ దాడి అంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు అవాస్తవమని పేర్కొన్నారు. బాధిత విద్యార్థి వాంగ్మూలం మేరకే కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.







వేడి నీళ్లు పడి గాయపడిన విద్యార్థిని

వ్యాధులపై అవగాహన కల్పించాలి

జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

మొయినాబాద్‌రూరల్: వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి బి. వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం చేవెళ్ల నియోజకవర్గంలోని ఆయా మండలాల వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలంలో డెంగీ, మలేరియాతో పాటు ఎలాంటి వ్యాధులు దరి చేరకుండా నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా డెంగ్యూ నివారణ గురించి అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డాక్టర్ రాకేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్, వైద్యాధికారులు వాణి, వరలక్ష్మి, శ్రీనివాస్‌రావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వరరావు

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

మొయినాబాద్: డెంగీ నివారణపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. గురువారం మొయినాబాద్‌లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. డెంగ్యూ నివారణపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి బి.వెంకటేశ్వరరావు సూచించారు. ర్యాలీలో చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్ఓ దామోదర్, డీఐఓ స్వర్ణకుమారి, మలేరియా అధికారి రాకేష్, వైద్యాధికారులు వాణి, రఘుబాబు, వరలక్ష్మి, శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తాళం పగులగొట్టి.. ఇంట్లో చొరబడి

3 తులాల బంగారం, రూ.70 వేల నగదు అపహరించిన దుండగులు

కందుకూరు: తాళం వేసి ఉన్న ఇంట్లో దుండగులు చొరబడి బంగారు ఆభరణాలు, నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నేదునూరుకు చెందిన కొమ్ము జంగయ్య కుటుంబీకులు బుధవారం రాత్రి భోజనం చేసి ఇంటికి తాళం వేసి డాబాపైన నిద్రపోయారు. కాగా అర్ధరాత్రి దుండగులు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలో ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.70 వేల నగదు దొంగిలించారు. గురువారం ఉదయం కిందికి వచ్చి చూసిన ఆ కుటుంబ సభ్యులు దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా బాధితుల ఇంటి సమీపంలో ఉండే నల్లి లక్ష్మమ్మ తన ఇంటి తలుపునకు బయటి నుంచి తాళం వేసి నిద్రించారు. విషయాన్ని గుర్తించని దుండగులు తాళాన్ని పగులగొట్టడానికి ప్రయత్నించగా ఆమె నిద్ర లేచి ఆరవడంతో పరారయ్యారు. ఈ మేరకు సీఐ మక్బూల్‌జానీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



చేవెళ్ల: జేసీబీతో వాగులో చెత్త తొలగింపు



చేవెళ్ల: జోరుగా కురుస్తున్న గాలివాన



చేవెళ్ల: ఆలూరు సమీపంలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

అకాల వర్షం.. తీరని నష్టం

- పూర్తిగా తడిసిపోయిన ధాన్యం
- పొంగిపొర్లుతున్న వాగులు

చేవెళ్ల: అకాల వర్షంతో ధాన్యం తడిసి ముద్దయింది. ఎండ వేడితో ఉన్న వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. చేవెళ్ల మండలంలో గురువారం మధ్యాహ్నం విపరీతంగా గాలివాన కురిసింది. దీంతో పలు గ్రామాల్లో ధాన్యం తడిసిపోయింది. చేసిన కష్టం నీటి పాలు అయిందని రైతులు బోరున విలపించారు. మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్‌గౌడ్ తన పొలంలో పండిన ధాన్యాన్ని చేవెళ్ల మార్కెట్ యార్డులో ఎండబెట్టారు. మధ్యాహ్నం వరకు ఎండనే ఉండగా.. అకస్మాత్తుగా వచ్చిన వర్షంతో ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతుకు వర్షం తీరని నష్టాన్ని తెచ్చిందని వాపోయారు. దాదాపు గంటపాటు ఏకధాటిగా వర్షం కురిసింది. మండలంలోని చిన్నచిన్న వాగుల్లో నీరు పారింది. చెత్త చెదారంతో నిండిపోయిన వాగుల్లోనుంచి చెత్త అంతా నీటిలో కొట్టుకుపోయి వచ్చి వాగులో చేరటంతో నీరు రోడ్డుపైకి వచ్చి పారాయి. దీంతో గ్రామస్తులు జేసీబీ సహాయంతో చెత్తను తొలగించే పనులు చేపట్టారు.



చేవెళ్ల: మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యం

యూక్టి ఇన్నోవేషన్‌లో వర్సిటీకి గుర్తింపు

కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథివర్మ

మొయినాబాద్‌రూరల్: యూక్టి ఇన్నోవేషన్ ఛాలెంజ్‌లో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు చేసిన ప్రాజెక్టులకు నేషనల్ ఇన్నోవేషన్ రిపోజిటరీ గౌరవం లభించిందని వైస్‌ఛాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అజీజ్‌నగర్ సమీపంలో గల కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ద్వారా నేషనల్ ఇన్నోవేషన్ రిపోజిటరీ సర్టిఫికెట్‌ను కళాశాలకు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వైస్‌ఛాన్సలర్ పార్థసారథివర్మ మాట్లాడుతూ.. 2024 వైఐసీ సభ్యులు సాధించిన విజయంతో యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో గౌరవం లభించిందన్నారు. ఈ యూనివర్సిటీలో విద్యార్థులు, అధ్యాపకులు రూపొందించిన ఆవిష్కరణ వ్యవస్థాపకతలకు శక్తివంతమైన సాంస్కృతిని సృష్టించడం జరిగిందన్నారు. మూల స్తంభంగా యూక్టి 2.0 నిలిచిందని తెలిపారు. ప్రాజెక్టు కోసం ఆటోమెటిక్ నాన్ కాన్‌టాక్ట్ శానిటేషన్‌కు ఈసీయూ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అశ్విన్‌కుమార్ నేతృత్వంలో వైస్ ప్రిన్సిపాల్ మాలోజి సుమన్ మార్గదర్శకత్వం నిర్వహించారన్నారు. దీంతో కళాశాల తరపున వారిని అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.



గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న వైస్ ఛాన్సలర్

ముందస్తు జాగ్రత్తలేవీ?



అబ్దుల్లాపూర్‌మెట్: రెడ్డికుంట చెరువు కట్టకు మట్టిబస్తాలతో రక్షణ

చెరువు కట్ట పటిష్టతకు చర్యలు తీసుకోవాలంటున్న రైతులు

అబ్దుల్లాపూర్‌మెట్: మూడేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు మండలం కేంద్రంలోని రెడ్డికుంట చెరువు, పెద్దఅంబర్‌పేట ఈదులచెరువు, బాటసింగారం బాత్కులచెరువు, కొత్తగూడెం చెరువు, లష్కర్‌గూడ కత్వలకు గండ్లు పడ్డాయి. అప్పట్లో వీటికి నామమాత్రపు మరమ్మతులు చేసి వదిలేశారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని రైతులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని రెడ్డికుంట చెరువు కట్ట పూర్తిగా తెగిపోవడంతో కేవలం మట్టిబస్తాలతో అడ్డుకట్ట వేశారే తప్ప శాశ్వత చర్యలు చేపట్టకపోవడంతో ఇరిగేషన్ అధికారుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఈ చెరువు కట్ట తెగిపోతే అంతరాయం ఏర్పడుతుంది. వర్షాకాలం సమీపిస్తున్న వేళ ఎక్కువ ప్రమాదకరంగా ఉన్న చెరువులు, కుంటలపై ఇరిగేషన్ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి భారీ నష్టాలు జరగకముందే శాశ్వత మరమ్మతులు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

దాడికి పాల్పడిన ఐదుగురిపై కేసు

మీర్‌పేట: పాత గొడవల నేపథ్యంలో దాడికి పాల్పడిన ఐదుగురిపై మీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మీర్‌పేట లెనిన్‌నగర్‌కు చెందిన బొమ్మనబోయిన వెంకట్, సరిత భార్యాభర్తలు. వెంకట్ సినీనటుడు పవన్‌కల్యాణ్ ఇంటి వద్ద సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. వీరి ఇంటి ఎదురుగా నివాసముండే రమావత్ రఘు, సంధ్యతో పదేళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం మాటామాటా పెరగడంతో వెంకట్ మరో ఇద్దరితో కలిసి రఘుపై దాడి చేశాడు. దీంతో రఘు సాయంత్రం తన బంధువులతో కలిసి కర్రలు, రాళ్లతో వెంకట్ ఇంటిపై దాడి చేసి ద్విచక్ర వాహనాలతో పాటు ఇంటి అద్దాలను ధ్వంసం చేశారు. బాధితుడు వెంకట్ ఫిర్యాదు మేరకు రఘు అతని భార్య సరిత, మరో ముగ్గురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

వ్యక్తి గల్లంతు

మాడ్గుల: ఈతకు వెళ్లిన వ్యక్తి బావిలో మునిగిన సంఘటన కోల్కులపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు.. నర్సాయిపల్లి గ్రామనికి చెందిన బైకని కోమరయ్య(40) గురువారం మధ్యాహ్నం కోల్కులపల్లిలోని ఓ బావిలో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతు అయ్యాడు.

సీఎంను కలిసిన తంగడపల్లివాసులు

చేవెళ్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చేవెళ్ల మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిలో మండలంలోని తంగడపల్లి గ్రామానికి చెందిన మండల పార్టీ ఉపాధ్యక్షుడు పాండుయాదవ్, పార్టీ నాయకుడు మానిక్యం ఉన్నారు. ఈ సందర్భంగా వారు తంగడపల్లి గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. సీసీరోడ్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, తంగడపల్లి–ఆలూరు మధ్యలో బ్రిడ్జి నిర్మాణాలకు సహకరించాలన్నారు. ఆలూరును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు

షాద్‌నగర్ న్యాయవాదికి పురస్కారం



అవార్డు అందుకుంటున్న మహేందర్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న షాద్‌నగర్ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డికి ప్రశంసలు దక్కాయి. ఈ మేరకు బుక్ రీడింగ్ అండ్ కల్చరల్ సొసైటీ, శ్రీరాగ సినీ మ్యూజికల్స్ వారి ఆధ్వర్యంలో న్యాయ సేవారత్న స్వర్ణ మహానంది అవార్డును అందజేశారు. గురువారం హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో ఉన్న శ్రీ త్యాగరాయ సభలో ఉత్తమ సేవా కార్యక్రమాలు చేపట్టిన వారికి అవార్డు లు ఇచ్చారు. కేంద్ర సెన్సార్ బోర్డు సభ్యుడిగా, న్యాయవాదిగా, సామాజిక వేత్తగా కొనసాగుతూ సేవా కార్యక్రమాలు చేపట్టిన మహేందర్‌రెడ్డి, సంస్థ చైర్మన్ డీవీవీఎస్ నారాయణ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

కొడుకును చూసేందుకు వెళ్తూ..

- తండ్రి దుర్మరణం
- లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతో జరిగిన ఘాతుకం

యాచారం: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుమారుడిని చూడటానికి వెళ్లిన ఓ తండ్రిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. ఈ సంఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం కుదబక్షాపల్లి గ్రామానికి చెందిన సిరపంగి అంతయ్య(65) కందుకూర్ మండలంలోని నేదునూర్ గ్రామంలో బంధువు మృతి చెందడంతో బుధవారం రాత్రి గ్రామానికి వచ్చారు. అదే క్రమంలో తన కుమారుడు లక్ష్మయ్య అనారోగ్యంతో మాల్ మార్కెట్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోమాలో ఉన్నారు. గురువారం ఉదయం అంతయ్య తన కొడుకును చూడటానికి గ్రామం నుంచి స్కూటీపై బయలుదేరారు. మార్గమధ్యలో మాల్‌లోని ప్రధాన చౌరాస్తాలో స్కూటీని నిలిపాడు. అప్పటికే అక్కడ నిలిపి ఉన్న మహా సిమెంట్ కంపెనీకి చెందిన లారీ డ్రైవర్ వెనకాల ఉన్న స్కూటీని గమనించకుండా కదిలించాడు. దీంతో అంతయ్య లారీ వెనుక చక్రం కింద నలిగిపోయాడు. ఇది గమనించిన స్థానికులు కేకలు వేయడంతో లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న యాచారం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి తీవ్ర గాయాలైన అంతయ్యను మాల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు 108 అంబులెన్స్‌లో నగరానికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య ముత్తమ్మ, ఇద్దరు కూతుర్లు, ఒక కొడుకు ఉన్నారు.



అంతయ్య మృతదేహం

న్యాయం చేయాలని బైఠాయింపు

అంతయ్య మృతితో ఆయన కుటుంబం వీధి పాలైందని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు యాచారం పోలీసులకు విజ్ఞప్తి చేశారు. మృతదేహాన్ని ఠాణా ముందే ఉంచి న్యాయం చేయాలని పెద్ద సంఖ్యలో ఆందోళనకు సిద్ధమయ్యారు. సమాచారం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అంతయ్య మృతికి కారకుడైన లారీ డ్రైవర్, ఆ కంపెనీపై తగు చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పోలీసులకు సూచించారు. దీంతో ఆందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యతో గొడవపడి వ్యక్తి అదృశ్యం



షేర్‌ఖాన్ (ఫైల్)

పహాడీషరీఫ్: భార్యతో గొడవపడిన ఓ వ్యక్తి ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. వాదే ముస్తఫా బస్తీకి చెందిన రుబీనాబేగం, షేర్‌ఖాన్(50)లు భార్యాభర్తలు. ఈ నెల 14న షేర్‌ఖాన్ మద్యం తాగి ఇంటికి వచ్చాడు. ఇంటి ఖర్చులకు సంబంధించి భార్య అతన్ని డబ్బులు అడిగింది. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య గొడవ జరగడంతో షేర్‌ఖాన్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

మతిస్థిమితం లేని యువకుడి..



బికాశ్‌దాస్ (ఫైల్)

కొత్తూరు: మతిస్థిమితం సరిగ్గా లేని ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన కొత్తూరు పట్టణంలో గురువారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలో నివాసం ఉంటున్న బెన్నుదాస్ కుమారుడు బికాశ్‌దాస్(22)కు మతిస్థిమితం సరిగ్గా లేదు. ఈ నేపథ్యంలో బెన్నుదాస్ కుటుంబ సభ్యులు ఈ నెల 6న పనులకు వెళ్లగా ఇంటి వద్ద ఉన్న బికాశ్‌దాస్ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ కోసం పలుచోట్ల వెతికిన లభ్యం కాలేదు. దీంతో బెన్నుదాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఆర్టీసీ బస్సులో నుంచి దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

కొందుర్గు: రన్నింగ్ బస్సులో నుంచి దూకి ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన కొందుర్గు మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన మరియమ్మ, దస్తగిరి దంపతులు గ్రామాల్లో సంచరిస్తూ నాటకాలు, సర్కస్ చేస్తూ జీవనం సాగిస్తారు. అయితే గురువారం మధ్యాహ్నం కొందుర్గు బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సు ఎక్కి షాద్‌నగర్ బయలుదేరారు. కాగా భార్యాభర్తలు ఇద్దరు బస్సులో గొడవపడి శ్రీరంగాపూర్ సమీపంలోకి వెళ్లగానే మరియమ్మ రన్నింగ్ బస్సులో నుంచి బయటకు దూకింది. ఇది గమనించిన ప్రయాణికులు, స్థానికులు బస్సు నిలిపి చూసేసరికి మరియమ్మ గాయాలపాలైంది. దీంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అదే దారిలో వెళ్తున్న ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం సంఘటన స్థలాన్ని సందర్శించి బాధిత మరియమ్మను చికిత్స కోసం ఆటోలో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై తమకు ఎలాంటి సమాచారం అందలేదని కొందుర్గు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రీ దుర్మరణం



శివ (ఫైల్)

కొత్తూరు: రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రీ మృతి చెందిన సంఘటన కొత్తూరు పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన శివ(43) గత కొన్ని నెలలుగా కుటుంబంతో కలిసి కొత్తూరులో నివాసం ఉంటూ తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం కొత్తూరు నుంచి తన బైకుపై స్వగ్రామానికి బయలు దేరగా శివారులో పాత జాతీయ రహదారిపై కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ఉన్న శివ కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటనపై మృతుడి భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నీటి గుంతలో పడి వ్యక్తి మృతి



భవానీజి మృతదేహం

తలకొండపల్లి: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి నీటి గుంతలో(ఫాం పడ్స్) పడి మృతి చెందాడు. ఈ విషాదకరమైన సంఘటన మండల పరిధిలోని చంద్రధనలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీకాంత్ చెప్పిన వివరాల ప్రకారం.. చంద్రధనలో మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. మహబూబ్‌నగర్ పట్టణం నుంచి భవానీజి(45) గత రెండు రోజుల క్రితం చంద్రధనలో ఉన్న తమ బంధువుల ఇంటికి వచ్చారు. ఆయన గురువారం తెల్లవారుజామున గ్రామ శివారులో ఉన్న నీటి గుంతలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి నీటి గుంతలో పడిపోయాడు. గ్రామస్తుల సహాయంతో ఆయన్ని బయటికి తీశారు. చికిత్స నిమిత్తం భవానీజిని తలకొండపల్లి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుమారుడు శివప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.